


ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 58 తిరుపతి తేది : శనివారం 30 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS




## జవాబుదారీతనం ఉండాల్సిందే

- ఇంత నిఘాలో నీట్ పేపర్ ఎలా లీకైంది?
- ఎన్‌టిఏకి సుప్రీం ప్రశ్నలు
- ఇలాంటి ఘటనలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభ
- యుపిఎస్ సి ని చూసి నేర్చుకోవాలంటూ చీవాట్లు

న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, మే 29

నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు తాజాగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)పై పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, పర్యవేక్షణ కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. ఇలాంటి ఘటనలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభ కలిగిస్తాయని పేర్కొంది. పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటివరకు అసలు సమస్య ఆగదని తెలిపింది. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యుపిఎస్‌సిలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యుపిఎస్‌సిని చూసి నేర్చుకోవాలని ఎన్‌టిఏకు సూచించింది. కోర్టు విచారణకు ఎన్‌టిఏ తరపున సాలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు ఏర్పాటైన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా.రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టిఏ, రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను ధర్మాసనం పరిశీలించింది. కేంద్ర ప్రభుత్వం తన అఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఆరు వారాల్లో దాఖలు చేయాలని ఆదేశించింది.

## సీఎం చంద్రబాబుతో మంత్రి గిరిరాజ్ సింగ్ భేటీ..

-ఏపీకి పూర్తి సహకారం అందిస్తామని హామీ
- అమరావతిలో నిఫ్ట్, కుప్పంలో పీఎం మిత్రా పార్క్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- అరటి, కొబ్బరి, వెదురు పీచుతో రైతులకు అదనపు ఆదాయం కల్పించేలా ప్రణాళిక
- సచివాలయంలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- ఏపీలో చేనేత, హస్తకళల అభివృద్ధికి ప్రత్యేక పార్కులు, మ్యూజియం ఏర్పాటుకు విజ్ఞప్తి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ



అమరావతి – ఆంధ్రనాడు, మే 29

ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ మార్గాలు సృష్టించడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా, ఉద్యాన పంటల నుంచి లభించే ఫైబర్‌కు విలువ జోడించి జౌళి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు పలు కీలక ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం ముందుంచారు. శుక్రవారం సచివాలయంలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌తో సీఎం చంద్రబాబు సమావేశమై రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

- మిగతా 2లో..



## కాలుష్యరహితంగా పుష్కరాలు

- కార్యాచరణ ప్రణాళిక ప్రకటించిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

అమరావతి – ఆంధ్రనాడు, మే 29

గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 'స్వచ్ఛ గోదావరి -- పవిత్ర పుష్కరాలు' పేరిట సమగ్ర కార్యాచరణ ప్రణా ళికను ప్రకటించారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీలను గుర్తించి, వాటిని మురుగు రహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు. గోదావరిలో మురుగునీరు,

- మిగతా 2లో..

## ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్..

- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు ప్రతిపాదనలు
- 18 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా ప్రణాళిక
- ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశం
- పీఎం సూర్యఘర్ పథకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం సూచన

అమరావతి – ఆంధ్రనాడు, మే 29

ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు, దానిని సమర్థంగా గ్రిడ్‌కు అనుసంధానించేందుకు భారీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా, సుమారు రూ.22 వేల కోట్ల వ్యయంతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3' నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ శాఖ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్, విద్యుత్ సరఫరా, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలు పురోగతిపై విస్తృతంగా చర్చించారు.గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద చేపట్టనున్న చర్యలపై సీఎం ఆరా తీయగా, అధికారులు పూర్తి వివరాలు అందించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 18 గిగావాట్ల హరిత విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో 11 గిగావాట్ల సౌర విద్యుత్, 7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉంటుందని



- మిగతా 2లో..

## పులి సంచారంపై నిరంతర పర్యవేక్షణ

- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



అమరావతి – ఆంధ్రనాడు, మే 29

పోలవరం జిల్లా సరిహద్దులోని అటవీ ప్రాంతాల్లో పెద్ద పులి సంచారం నేపథ్యంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. పులి కదలికలపై అత్యాధునిక సాంకేతికతను వినియోగించి నిఘా కొనసాగించాలని, అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం చేరవేస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. చికిలింత పంచాయతీ పరిధిలోని పశువుల కొట్టాల్లో దూడలపై పులి దాడితో తొమ్మిది దూడలు మృతి చెందిన ఘటనపై క్యాంపు కార్యాలయంలో ఆయన అటవీశాఖ ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ప్రస్తుతం తిమ్మాపురం

- మిగతా 2లో..

## ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం చొరవ

-- బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతర సమీక్షకు ఆదేశాలు
-- ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల సమన్వయం
-- ప్రాధాన్య వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు
-- ధరల స్థిరీకరణ సమావేశంలో మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్



అమరావతి – ఆంధ్రనాడు, మే 29

ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరల మార్పులను నిత్యం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ 8వ సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రుల కమిటీ సభ్యులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ , వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ, పప్పులు, బియ్యం, వంట నూనెలు, టమోటా, ఉల్లిపాయల వంటి నిత్యావసర వస్తువుల డిమాండ్, రిటైల్ హోల్‌సేల్ మార్కెట్ ధరల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ ప్రభావంతో కొంతమేర ధరలు పెరిగినా, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో

- మిగతా 2లో..



## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం

-హోంమంత్రి అనిత

అమరావతి – ఆంధ్రనాడు, మే 29

మహిళలను కేవలం ఓటర్లుగా కాకుండా నాయకత్వ శక్తిగా తీర్చిదిద్దడమే టిడిపి లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మహానాడు వేదికగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం టికెట్లు కేటాయించాలని తీసుకున్న నిర్ణయం మహిళా సాధికారతకు చారిత్రాత్మక ముందడుగని పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు కుటుంబ ఆస్తుల్లో సమాన హక్కులు కల్పించిన తొలి నాయకుడు ఎన్‌టిఆర్ అని,

- మిగతా 2లో..

# జవాబుదారీతనం ఉండాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

**యుపిఎస్‌సి నిర్వహించే పరీక్షలు ఒక్కసారీ లీకు కాలేదు!**

ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్ నరసింహ స్పందిస్తూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని రాధాకృష్ణన్‌ను ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ ఎలా లీక్ అయ్యిందని, ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా సాధ్యపడిందన్నారు. పేపర్ లీక్ తో విద్యార్థులు మనోవేదనకు గుర య్యారని పేర్కొన్నారు. సివిల్స్ పరీక్షలు నిర్వహించే యుపిఎస్‌సికి సంబంధించిన పేపర్లు ఒక్కసారి కూడా లీక్ కాలేదని, ఈ విషయంలో యుపిఎస్‌సిని చూసి నేర్చుకోవాలని ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ)కి సుప్రీంకోర్టు చీవాట్లు పెట్టింది. నీట్ యూజి పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై డా. రాధాకృష్ణన్ బదులిస్తూ ప్రశ్నాపత్రం రూపకల్పనలోనే పేపర్ లీకేజీ జరిగిందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలనూ సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య రాకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్టు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**బాధ్యులు ఎవరో తేల్చాల్సిందే..**

కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసినా ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21న నిర్వహించనున్న పరీక్ష కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధానమంత్రి స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ కేసు విచారణను జూలై 2వ వారానికి వాయిదా వేస్తూ కోర్టు నిర్ణయం తీసుకుంది.

# పులి సంచారంపై నిరంతర పర్యవేక్షణ

(మొదటిపేజీ తరువాయి)

రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో పులి కదలికలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. అడవికి సమీపంగా ఉన్న ఆయిల్ ఫామ్ తోటలోని పశువుల పాకపై పులి దాడి చేసినట్లు వెల్లడించారు. పులి సంచార ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలు అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. మొత్తం పరిస్థితిని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ స్వయంగా పర్యవేక్షించాలన్నారు. పశువుల ప్రాణ నష్టానికి తక్షణ పరిహారం ఇప్పటికే కొంత మొత్తం రైతులకు అందజేసినట్లు అధికారులు తెలిపారు. పశువైద్యుల నివేదిక అందిన వెంటనే పూర్తి స్థాయి పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

# కాలుష్యరహితంగా పుష్కరాలు

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామిక వ్యర్థాలు, ఆక్వా కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు శుక్రవారం ప్రకటించిన కార్యాచరణలో పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగునీరు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతిరోజూ 8.38 మిలియన్ లీటర్ల మురుగునీరు గోదావరిలో కలుస్తున్నట్లు గుర్తించగా, దీని నివారణకు బిబి గ్రామ్ జి పథకంలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని నిర్ణయించారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పరిశీలనలో గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల మున్సిపాలిటీల నుంచి రోజుకు 104 మిలియన్ లీటర్ల మురుగునీరు గోదావరిలో కలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మరో 8.38 మిలియన్ లీటర్లు, ఆక్వా రంగం నుంచి 13.24 మిలియన్ లీటర్లు విడుదలవుతోందని గుర్తించినట్లు వెల్లడించారు. పారిశ్రామిక వ్యర్థాల్లో ఒక్క ఆంధ్ర పేపర్స్ నుంచే రోజుకు 32 మిలియన్ లీటర్ల వరకు జలాలు విడుదలవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో పారిశ్రామిక కాలుష్య నియంత్రణకు నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో ప్రతి మున్సిపాలిటీ సామర్థ్యానికి అనుగుణంగా మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టిపిలు) నిర్మించాలని ఆదేశించారు. గోదావరి కాలుష్య నియంత్రణ కోసం ఆర్‌టిజిఎస్ తరహాలో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రాంతాలవారీ సిసి కెమెరాలు, స్క్రీన్లు ఏర్పాటుచేసి ఎక్కడైనా మురుగు నేరుగా గోదావరిలోకి విడుదలవుతుందా అనే అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

# ధరల స్థిరీకరణకు కూటమి ప్రభుత్వం చొరవ

(మొదటిపేజీ తరువాయి)

సన్నద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఖరీఫ్-2026 సీజన్‌కు ముందస్తు సన్నద్ధత**

రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వ్యవసాయ , పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, మనోహర్ తెలిపారు. రైతులు ప్రాధాన్యత కలిగిన వరి వంగడాలను సాగు చేసేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డిమాండ్ తక్కువ ఉన్న వరి రకాల సాగు వల్ల ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా 1010, పీఆర్-126 వంటి రకాలలో అధిక శాతం నూక వస్తుండటంతో వినియోగానికి అనుకూలంగా లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించేలా యంత్రాంగానికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ధరలను అదుపులో ఉంచేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చామని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజ శేఖర్, పౌర సరఫరాల కమిషనర్ కె. కన్నా బాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ ఎస్. డిల్లీ రావు, ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబుతో మంత్రి గిరిరాజ్ సింగ్ భేటీ..

(మొదటిపేజీ తరువాయి)

అమరావతిలో నేషనల్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సీఎం బలంగా విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అరటి, కొబ్బరి, వెదురు, పోకచెక్క వంటి పంటల నుంచి లభించే పీచును వాణిజ్యపరంగా వినియోగించుకునే అవకాశాలను సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. ముఖ్యంగా కడప, అనంతపురం, నంద్యాల, గోదావరి జిల్లాల్లో అరటి కాండం నుంచి పీచు తీసే కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. పంట కోత తర్వాత వృథాగా పోయే అరటి కాండం నుంచి పర్యావరణ అనుకూల ఫైబర్ తయారు చేయడం ద్వారా వస్త్ర పరిశ్రమలో జనపనారకు ప్రత్యామ్నాయంగా వాడవచ్చని తెలిపారు. ఈ ప్రక్రియను స్వయం సహాయక సంఘాల ద్వారా క్లస్టర్ పద్ధతిలో ప్రోత్సహించాలని సూచించారు. అలాగే, గిరిజన, మెట్ట ప్రాంత రైతులకు ప్రయోజనం చేకూరేలా వెదురు ఫైబర్ ప్రాసెసింగ్ యూనిట్లను పీపీపీ పద్ధతిలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీనివల్ల రైతులకు 30 ఏళ్ల పాటు నిరంతర ఆదాయం లభిస్తుందని స్పష్టం చేశారు. తీర ప్రాంత జిల్లాల్లో కొబ్బరి పీచు పరిశ్రమను బలోపేతం చేయాలని, కాయిర్ జియో టెక్స్‌టైల్స్ పరిశ్రమలకు ప్రోత్సాహం అందించాలని కోరారు. ఉప్పునీటిని, కీటకాలను తట్టుకునే గుణం ఉన్న కొబ్బరి పీచుతో తయారు చేసే జియో-రోల్స్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందని, నేల కోత నివారణకు ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. పారిశ్రామిక అభివృద్ధిలో భాగంగా, మూడు రాష్ట్రాలకు కూడలిగా ఉన్న కుప్పంలో పీఎం మిత్రా పార్కు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఫైబర్ టు ఫ్యాషన్ విధానానికి ఈ పార్కు దోహదపడుతుందని తెలిపారు. అమరావతిలో నిఫ్ట్ ఏర్పాటుకు గతంలోనే 10 ఎకరాల భూమిని కేటాయించామని, దీనికి అవసరమైన రూ. 280 కోట్ల నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు మంగళగిరిలో చేనేత పార్కు, అమరావతిలో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, జౌళి మంత్రిత్వ శాఖ తరపున ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్..

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. ఈ కారిడార్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,261 కిలోమీటర్ల మేర కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు వేయనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, 9,500 మెగావాట్ల సామర్థ్యంతో ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో ఐదు భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కారిడార్ పూర్తయితే రాష్ట్రంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, తద్వారా భారీ పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును కాలపరిమితితో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**పీఎం సూర్యఘర్ అమలులో వేగం పెంచాలి**

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో ఏపీ ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉందని, అగ్రస్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు రూ.20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు బిగించే లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై 200 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళు ఏర్పాటు చేసే పనులు వేగవంతం చేయాలన్నారు. రెస్కో మోడల్‌లో, నెట్ మీటరింగ్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే, 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో 'నెట్ జీరో' విధానంలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

**సాంకేతికతతో విద్యుత్ నష్టాలకు చెక్**

దేశంలోనే తొలిసారిగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన 'ప్రవాహ్' సంస్థ సహకారంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ద్వారా 'డిజిటల్ ట్విన్ గ్రిడ్' రూపొందిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని గుర్తుచేశారు.

**సీఎంతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం బృందం భేటీ**

సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ 'సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్' కార్యాచరణపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి అంశాలపై ఈ కేంద్రం అధ్యయనం చేయనుంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులను జ4×= కార్యాచరణతో అనుసంధానం చేయాలని, ఫలితాలు సాధించేలా పనిచేయాలని ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే స్థాయికి ఎదగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 33 శాతం రిజర్వేషన్లు చారిత్రాత్మక నిర్ణయం

(మొదటిపేజీ తరువాయి)

మహిళలకు సమాన హక్కులు, గౌరవప్రదమైన స్థానం కల్పించేందుకు అనేక సంస్కరణలను తీసుకొచ్చారని చెప్పారు. మహిళల ఆర్థిక సాధికారతకు సిఎం చంద్రబాబు.. డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో బలమైన పునాది వేశారని తెలిపారు. మహిళలకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే రాజకీయాలు, పరిపాలన, విద్య, వ్యాపారం సహా అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తారని అన్నారు. తీవ్ర ఎండలను సైతం లెక్కచేయకుండా మహిళలు భారీ సంఖ్యలో మహానాడులో పాల్గొనడం పార్టీపై వారికి ఉన్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

# యువతకు ఉపాధికల్పనే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే ఆరణి



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 29 :** యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధేయంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రతి సంవత్సరం డిఎస్సీ నిర్వహించడంతో పాటు ఏపిపిఎస్సీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువనాయకులు, రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేష్ లు చర్యలు తీసుకున్నారని ఆయన చెప్పారు. బాలాజీ కాలనీలోని ఎస్ వి సి సి డిగ్రీ కాలేజీలో శుక్రవారం జాబ్ మేళాను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఎనిమిది వందల ఉద్యోగాల భర్తీకి ఏపిఎస్ ఎస్ డిసి, ఎంప్లాయిమెంట్ ఎక్స్ చేంజ్, సిడాప్ సంయుక్తంగా జాబ్ మేళాను ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీతోపాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి జాబ్ మేళాలు ప్రభుత్వం నిర్వహిస్తు న్నదని యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇప్పటి వరకు తిరుపతి నియోజకవర్గంలో నిర్వహించిన జాబ్ మేళాలో 2,735 మంది వివిధ కంపెనీల ఇంటర్వ్యూలకు హాజరు కాగా 1,694 ఉద్యోగాలు పొందారని ఆయన వెల్లడించారు. 22 ఎంఎన్ సి కంపెనీలు 800కు పైగా ఉద్యోగాల కల్పనకు జాబ్ మేళాలో పాల్గొనడం సంతోషకరమని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, పొనగంటి భాస్కర్, రాష్ట్ర కాపు కార్పోరేషన్ డైరక్టర్ వరప్రసాద్, జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఇంటికి ఒక మహిళా పారిశ్రామికవేత్తనుతయారు చేయడమే ఎన్డీఏ లక్ష్యం

**- ఎమ్మెల్యే ఆరణి ఆరణి శ్రీనివాసులు**




**తిరుపతి – ఆంధ్రనాడు, మే 29**

మహిళ సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ సాధనకు కృషి చేస్తున్నదని ఆయన చెప్పారు. 39వ డివిజన్ లోని చెన్నారెడ్డి కాలనీలో 40 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా స్వశక్తి భవనాన్ని శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ శారదాదేవీ లు ప్రారంభించారు. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు మెప్మా ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మహిళా స్వశక్తి భవనాల ద్వారా డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసి మహిళా సాధికారత కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన చెప్పారు. మహిళల్లో నైపుణ్యాభివృద్ధి పెంపొందించేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ఈ భవనాలు ఎంతో ఉపయోగపడుతాయని ఆయన తెలిపారు. ఇంటికొక మహిళా పారిశ్రామిక వేత్తను తయారు చేసే లక్ష్యంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తున్నదని ఆయన చెప్పారు. అలాగే 40,41 డివిజన్ లకు సంబంధించి 18 లక్షలతో నిర్మించిన మస్టర్ రూమ్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ శారదా దేవీ, ఎన్డీఏ కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో గ్రీన్, బ్యూటికేషన్ కార్పోరేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, బిజేపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, టిడిపి క్లస్టర్ ఇన్చార్జ్ పుష్పావతి, పొనగంటి భాస్కర్ , జనసేన నగర అధ్యక్షులు రాజా రెడ్డి, జోష్ ప్రకాష్, దిలీప్, సింగాళగుంట చందు, ఆముదాల వెంకటేష్, హరిశంకర్, బాలిశెట్టి కిషోర్, రమణా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆదం సుధాకర్ రెడ్డి, నీలాద్రి,ఆళ్వార్ మురళీ, ప్రభాకర్ రెడ్డి, లచ్చీ రాయల్, చరణ్, పాల్గొన్నారు.

# దుకాణాలలో లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ తనిఖీలు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 29 :** మండల కేంద్రంలోని పలు దుకాణాలలో పల మనేరు తూనీకలు, కొలతలు శాఖ ఇన్స్పెక్టర్ రమాదేవి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని, వస్తువులపై తయారీ తేదీ తప్పనిసరిగా ఉండాలన్నారు. తూనీకలు, కొలతల శాఖ వారిచే అనుమతి పొందిన తూనీక యంత్రాలను ఉపయోగించాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన ఎడల జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

# ప్రభుత్వ చట్టాలపై అవగాహన ఉండాలి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 29 :** ప్రభుత్వ చట్టాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ మారప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని శెట్టివారిపల్లెలో ప్రభుత్వ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు. అలాగే మహిళలపై జరుగుతున్న దాడులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ యుగేష్ రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# హమాలీకి అండగా నిలిచిన టీడీపీ నేతలు



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 29:** ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన నిరుపేద హమాలీకి టీడీపీ నేతలు వీల్ చైర్ అందజేసి అండగా నిలిచారు. వివరాల మేరకు.. తంబళ్లపల్లి పట్టణం కృష్ణానగర్ కు చెందిన మౌలాలి హమాలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఓ దుకాణంలో పనిలో ఉండగా సిమెంట్ బస్తాలు మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెన్నెముక దెబ్బతినడంతో తిరుపతి ఆసుపత్రిలో ఆపరేషన్ చేసుకుని గురువారం రాత్రి ఇంటికి వచ్చాడు. మంచానికే పరిమితమైన మౌలాలిని శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి కొండ్రెడ్డి, టీడీపీ బీసీ నేత మాదారపు చంద్రశేఖర్ పరామర్శించి వీల్ చైర్ అందజేశారు. టీడీపీ తరపున అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు భరోసా ఇచ్చారు.

# పాముకాటుతో యువ రైతుకు అశ్వస్థత



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 29:** పాము కాటుకు గురై యువ రైతు అశ్వస్థతకు గురైన సంఘటన శుక్రవారం తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. తంబళ్లపల్లి మండలం గుండ్లపల్లెకు చెందిన శ్రీరాములు కుమారుడు విశ్వనాథ (29) శుక్రవారం ఉదయం పొలం వద్ద పశువుల మేత కోసం గడ్డి కోస్తుండగా రక్త పింజరి పాము కాలుకు కాటేసింది. గమనించిన విశ్వనాథ్ పామును చంపేసి హుటాహుటిన తంబళ్లపల్లె ఆసుపత్రికి వచ్చి చికిత్సలు పొందాడు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. పొలాల్లో రాత్రి వేళల్లో రైతులు నడిచేప్పుడు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు సీజ్

**రామచంద్రాపురం – ఆంధ్రనాడు, మే 29 :** అక్రమంగా తిరుపతి సమీపంలోని స్వర్ణముఖి నది నుండి ఇసుకను తరలిస్తుండిన రెండు టిప్పర్లను స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సీజ్ చేసి రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ కు తరలించారు. గృహ నిర్మాణాలకు అవసరమైన వారు సొంతంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని ప్రవేశపెట్టింది. అయితే ఇసుక మాఫియా టిప్పర్లతో అక్రమంగా తరలిస్తున్నారు. శుక్రవారం పోలీసు ఉన్నతాధికారు లకు అందిన రహస్య సమాచారం మేరకు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆర్సీపురం పోలీసులతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా స్వర్ణ ముఖీ నది నుంచి రెండు టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండటం వారి కంటపడింది. టిప్పర్లకు ఎలాంటి రికార్డులు లేకపోవడం, డ్రైవర్ కు లైసెన్స్ లేని విషయం పోలీసులు గుర్తించి రెండు ఇసుక టిప్పర్లను సీజ్ చేశారు. నిత్యం టిప్పర్లలో స్వర్ణముఖి నుండి రామచంద్రపురం మీదుగా చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తూనే ఉంటారు.



కానీ తిరుపతి పోలీసు ఉన్నతాధికారులు స్థానిక రామచంద్రపురం పోలీసులకు సంబంధం లేకుండా స్పెషల్ బ్రాంచ్ పోలీసుల ద్వారా తనిఖీలు చేసి వాహనాలను సీజ్ చేసిన విషయం హాట్ టాపిక్ గా మారింది. రామచంద్రపురం మీదుగా నిత్యం టిప్పర్ల ద్వారా ఇసుక, ఎర్ర మట్టి, గ్రావెల్ రవాణా జరుగుతున్నప్పటికీ స్థానిక పోలీసుల దృష్టికి వచ్చినా చూసి చూడనట్లు వ్యవహరించడంలో ఆంతర్యం ఏమిటని ప్రజలు చర్చించుకుంటున్నారు ఇసుక గ్రావెల్ అక్రమ రవాణాలో పోలీసులు ఇతోధికంగా సహాయపడుతున్నట్లు ప్రజలు విమర్శిస్తున్నారు.

# బైరెడ్డిపల్లి మండలంలో వడగళ్ళు వర్షం

- కాశ్మీర్ ను తలపించిన నాకిరేళ్ల కుంట, బొగ్గిలంక
- నాకిరేళ్ల కుంట, బొగ్గిలంక వద్ద రాళ్ళ వర్షం
- 60 సంవత్సరాలుగా ఎన్నడూ చూడని వడగళ్ళు వర్షం

**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 29:** మండలంలోని కడపనత్తశీ గ్రామ పరిధిలో నాకిరేళ్ల కుంట, బొగ్గిలంక వద్ద శుక్రవారం 4.00 గంటల ప్రాంతంలో వడగళ్ల వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు ఏడ తెరపి లేకుండా విస్తారంగా వర్షం కురిసింది. ఎర్రటి మట్టి నెలలు తెల్లటి మంచు గడ్డలతో కనువిందు చేశాయి. వీటిని రైతన్నలు చూసి ఆశ్చర్యానికి గురైనారు. సుమారు ఈ ప్రాంతంలో 60 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాం.. ఇదే వృత్తి పై జీవనం సాగిస్తున్నాం కానీ ఇలాంటి వడగళ్ల వర్షం ఎన్నడూ చూడలేదని నేడు తెల్లటి మంచు గడ్డలు చూస్తుంటే కాశ్మీర్ ను తలపించిందని రైతన్నలు ఆంధ్రనాడు తెలుగు దిన పత్రికతో ముచ్చటించారు. కానీ ఈ వర్షం రైతన్నలకు భారీ నష్టం చేకూరిందని వాపోయారు. పచ్చటి వనాన్ని తలపిస్తున్న ఉద్యాన పంటలు ఒక్కసారిగా నేల వాలాయి. చెట్టు యొక్క పత్రాలు చిందర బొందరైనాయి. ఒక పక్క వర్షం పడిందని హర్షం మరో



పక్క నష్టం చేకూరిందని బాధ ఇలాంటి అనుభూతి శుక్రవారం రైతన్నలకు ఎదురు పడ్డది. మేఘశీ నుండి జారిపడ్డ మంచు గడ్డలు... నేలకు జారీ పడ్డ మంచు గడ్డలను రైతన్నలు సేకరించి వాటిని వాటర్ బాటిల్స్ లో వేసుకున్నారు. ఎందుకని ప్రశ్నిశీచగా చక్కటి పురాతన పెద్దల వైద్యం చెప్పుకొచ్చారు.. ఇలా నేల పడ్డ మంచు గడ్డలను సేకరించి స్టోర్ చేసుకోని భద్ర పరుచుకొంటే ఎప్పుడైనా తేలు (విష పురుగు) వంటివి శరీరంపై కుడితే అవి గాట్లు పెట్టిన చోట భద్రపరిచిన మంచు నీరును పోస్తే చాలు నొప్పి అనేది మాయం అవుతుందని కడపనత్తశీ గ్రామానికి చెందిన చంద్రచ్యారీ చక్కటి రేమడి వైద్యం అందించారు.

# రేణిగుంటలో ఈవీఎం గోడౌన్ల తనిఖీ

**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 29 :** రేణిగుంట సమీపంలోని ఈవిఎం గోడౌన్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తనిఖీలు నిర్వహించారు. ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఈవీఎం గోడౌన్ లను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తనిఖీలు చేశారు. జిల్లాకు సంబంధించి ఈవీఎంలను భద్రపరిచిన గోదాము వద్ద 24ఇ7 నిరంతరం నిఘా, పటిష్టమైన భద్రత ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల



మార్గదర్శకాలు ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయం సమీపంలోని సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్ నందు భద్రపరచబడిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, సి డబ్ల్యు సి గోదామును శుక్రవారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్ లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాలు, సీలింగ్ తదితరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలన చేసారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సెల్ సూపరింటెండెంట భాగ్యలక్ష్మి, రేణిగుంట తహసిల్దార్ శ్యాం ప్రసాద్ పవన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# వేణుగోపాలపురంలో అవగాహన కార్యక్రమం

**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 29:** రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ చక్రపాణి ఆదేశాలమేరకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు ఆరోగ్య సిబ్బందితో కలిసి రేణిగుంటలోని వేణు గోపాలపురంలో మహిళలు మరియు యుక్త వయస్సు బాలికలను సమావేశ పరచి ప్రపంచ ఋతు పరిశుభ్రత దినోత్సవం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ దినోత్సవం ప్రతి సంవత్సరం మే 28 వ తేదీన జరుగుతుందని, ఋతుస్రావం (పీరియడ్స్) రజస్వలయైన యుక్తవయస్సు బాలికల నుంచి ఎదిగిన మహిళలలో బహిష్టుక్రమం ఆగేవరకు ఇది సహజమైన శరీర ధర్మమని, ప్రకృతి సిద్ధంగా జరిగే జీవ ప్రక్రియయని ఆ సమయంలో ప్రతి మహిళా (నెలసరి) పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని హెల్త్ సూపర్వైజర్ కామరాజు పేర్కొన్నారు. ప్రతి 28 రోజులకు ఒకసారి మహిళల లో వచ్చే ఈ ఋతుచక్ర ధర్మం వలన మహిళలు ఎలాంటి ఇన్ఫెక్షన్లు, అనారోగ్య సమస్యలకు గురికాకుండా నివారించి, వారి ఆరోగ్యానికి రక్షణగా ఉండేలా హాజరైన బాలికలు, మహిళలకు హెల్త్ సూపర్వైజర్ కామరాజు పరిశుభ్రత మరియు గర్భాశయ ముఖద్వార కాన్సర్ నివారణకు ఇచ్చే హెచ్‌పివి వాక్సినేషన్ ప్రాముఖ్యత మరియు ఆవశ్యకత పై ఆరోగ్య సలహాలు సూచనలు ఇచ్చారు. ఋతుచక్ర సమయంలో శానిటరీ ప్యాడ్లు లేదా మెన్స్ట్రువల్ కప్పులను కనీసం 6 గంటలకొకసారి తప్పనిసరిగా మార్చాలని, ఎక్కువసేపు ఒకే ప్యాడ్ వాడటం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉందని, రోజుకు కనీసం రెండుసార్లు గోరువెచ్చని నీటితో జననేంద్రియ ప్రాంతాన్ని శుభ్రం చేసు



కోవాలని సూచించారు. మహిళలు మల విసర్జన తర్వాత తమ మల మార్గాన్ని ముందు నుంచి కాకుండా వెనుక నుంచి వెనుకకే కడిగి పరిశుభ్రత పాటించడం వలన బ్యాక్టీరియాల ద్వారా ఇన్ఫెక్షన్ లు రావని వ్యాధులు వ్యాప్తి చెందకుండా నివారించవచ్చునని తెలిపారు. ప్రైవేట్ భాగాలను కడగడానికి సువాసనగల సబ్బులు లేక రసాయన ఉత్పత్తులను ఉపయోగించరాదని, ఇవి చికాకును, ఇన్ఫెక్షన్లను కలిగిస్తాయని, పీరియడ్స్ సమయంలో గాలి బాగా ఆడేలా ఉండే కాటన్ లోదుస్తులను మాత్రమే ధరించడం మంచిదని,తేమ ఎక్కువగా ఉండటం వల్ల బ్యాక్టీరియా వృద్ధి చెందుతుందని, వాడిన ప్యాడ్లను ఎక్కడబడితే అక్కడ వేయకుండా పేపర్లో చుట్టి డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ టాయిలెట్లలో వేయరాదని, ఋతుచక్ర సమయంలో మంచి పోషకవిలువలు గల ఆహారం తీసుకోవడం, కంటినిండా నిద్రపోవడం చాలా ముఖ్యమని, ఋతుచక్ర సమయంలో పరిశుభ్రత ఆవశ్యకతపై చర్చ జరగడం, మహిళలకు కౌమారదశలోగల బాలికలకు, కళాశాల విద్యార్థినులకు అందరికీ అవగాహన కల్పించడం కోసమే ప్రతి ఏటా జరుపుతారని, మహిళలలో ఉన్న అపోహలు, కళంకాన్ని రూపుమాపడం దీని ప్రధాన ఉద్దేశ్యమని హెల్త్ సూపర్వైజర్ కామరాజు పేర్కొన్నారు. బహిష్టు సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత మరియు శుభ్రమైన ప్యాడ్స్, శుభ్రమైన కాటన్ బట్టలు వాడటం వల్ల అనేక ఇన్ఫెక్షన్లు, ఆరోగ్య సమస్యలను నివారించ వచ్చునని, ప్రతి ఒక్కరు ఎలాంటి వివక్ష, అడ్డంకులు లేని సురక్షితమైన మరియు గౌరవప్రదమైన రీతిలో తమ రుతుచక్రాన్ని నిర్వహించుకోవడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించడం కోసమే భారత ప్రభుత్వం మరి యు వైద్య ఆరోగ్య విభాగాలు గ్రామీణ ప్రాంతాల్లో శానిట రీ నాప్‌కిన్‌ల లభ్యతను పెంచడానికి, వాటి సురక్షితమైన పారవే తకు వివిధ కార్యక్రమాలను అమలు చేస్తున్నా యని హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎఎన్ఎం లోహిత, ఆశాకార్యకర్తలు లక్ష్మీప్రస న్న, శశిరేఖ, మహిళలు, యుక్త వయస్సు బాలికలు పాల్గొన్నారు.

# నాగలాపురంకి ఎంపీడీవో బాలాజీ నాయక్ నా...?




**నాగలాపురం, ఆంధ్రనాడు, మే 29:** నాగలాపురం మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలోని సమాచార హక్కు చట్టం2005 నోటీసు బోర్డులో అప్పిలేట్ అధికారిగా బి.బాలాజీ నాయక్ పేరు ఇంకా దర్శనం ఇస్తున్నది. గతంలో నాగలాపురం ఎంపీడీవోగా పనిచేసిన బాలాజీ నాయక్ జనవరి 8వ తేదీన బదిలీపై వెళ్లిపోవడంతో ఇదే కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న ఎస్.జి.శేఖర్ రాజు ను ఇన్చార్జి ఎంపీడీవో గా నియమిస్తూ ఆదేశాలు రావడంతో జనవరి 9వ తేదీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రూప్ -1 ద్వారా నాగలాపురం మండలానికి ఎంపీడీవో గా మార్చి 25వ తేదీ శ్రీతేజస్విని బాధ్యతలు స్వీకరించారు. కానీ అప్పటినుండి నేటి వరకు ఈ సమాచార హక్కు చట్టం బోర్డు పైన ఉన్న పేర్లను మార్చకుండానే కాలయాపన చేస్తున్నారు. సమాచార హక్కు చట్టం 2005 కింద దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలు ఎవరికి దరఖాస్తు చేసుకోవాలో అర్థం కాక ఉన్నామని దరఖాస్తుదారులు విన్నవించుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ సమాచార హక్కు చట్టం 2005 పైన నూతన ఎంపీడీవో పేరును నమోదు చేయవలసిందిగా కోరుతున్నారు.

# కావమ్మ తిరుణాళ్లలో మాజీ సర్పంచ్ చిన్నదురై సుధా దర్శనం



**నాగలాపురం – ఆంధ్రనాడు, మే 29:** నాగలాపురం బి.కే.యం వీధిలో జరుగుతున్న శ్రీ కావమ్మ తిరుణాళ్లు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా నాగలాపురం మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ చిన్నదురై సుధా శుక్రవారం ఆలయానికి విచ్చేసి శ్రీ కావమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి పూలమాల వేసి సత్కరించి మర్యాద చేశారు. తిరుణాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సర్పంచ్ తో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం

**- విద్యా రుణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని బ్యాంకర్లకు ఆదేశం**
**- పీఎంఈజీపీ యూనిట్ల గ్రౌండింగ్‌పై ప్రత్యేక దృష్టికి జెసి ఆదేశం**



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 29:** వార్షిక జీవనోపాధి ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసిపీ ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు సకాలంలో మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు బ్యాంకర్లను ఆదేశించారు. శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ (డీఎల్ఆర్సీ) సమావేశం జేసీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని విద్యాసంస్థల నేపథ్యంలో విద్యా రుణాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పీఎంఈజీపీ పథకం కింద మంజూరైన యూనిట్లను త్వరగా గ్రౌండింగ్ చేయాలని, ప్రైవేట్ బ్యాంకులు రుణాల మంజూరులో మరింత వేగం పెంచాలని ఆయన ఆదేశించారు. అలాగే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ సకాలంలో జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో ఆర్థిక సాక్షరత కార్యక్రమాల్లో భాగంగా డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించే ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్డీఓ రవీంద్రబాబు, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఎల్డీఎం గుంటూరు రవికుమార్, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సామంచి శర్మతో పాటు వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

# ఎల్ఐసి మేనేజర్ కి వీడ్కోలు



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 29:** శ్రీకాళహస్తి ఎల్ఐసి కార్యాలయానికి సత్యవేడు శాటిలైట్ ఎల్ఐసి కార్యాలయముగా 2009వ సంవత్సరంలో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో 2023 వ సంవత్సరంలో సత్యవేడు శాటిలైట్ ఎల్ఐసి కార్యాలయనికి మేనేజర్‌గా మోహన్ బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుండి కార్యాలయంలో ఎల్ఐసి డెవలప్మెంట్ అధికారులకు, ఏజెంట్లకు, పాలసీదారులకు అందుబాటులో ఉండి మరింత సేవ అందించారు. ఈ క్రమంలో బదలీపై నెల్లూరులోని సి.ఏ.బి ఎల్ఐసి కార్యాలయానికి మేనేజర్ గా బదిలీ కావడంతో శుక్రవారం ఎల్ఐసి కార్యాలయంలో క్యాషియర్ మేఘనాదం, డెవలప్మెంట్ అధికారులు ఏ.వి.సుబ్బయ్య, మల్లికార్జున శర్మ, శ్రీకృష్ణ, రాజేష్, ఏజెంట్లు, సిబ్బంది శాలువా కప్పి వీడ్కోలు పలికారు.

# ధర్మరాజుల మహోత్సవంలో ఎంపీ గురుమూర్తి

**- శ్రీనివాసపురంలో భక్తి వైభవం.. గ్రామ ప్రజలతో మమేకం**



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 29:** కేవీబీపురం మండలంలోని శ్రీనివాసపురం (మారప్పరెడ్డికండ్రిగ) గ్రామంలో జరుగుతున్న శ్రీ శ్రీ ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల మహోత్సవం భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా కొనసాగుతోంది. మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరయ్యారు.గ్రామానికి చేరుకున్న ఎంపీకి గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్న ఎంపీ ప్రత్యేక పూజల్లో పాల్గొని ప్రజల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాల కోసం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక మహోత్సవాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామ ప్రజలతో ముచ్చటిస్తూ వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు.గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, నంద కుమార్, లాల్‌బాబు యాదవ్, మాజీ సర్పంచులు రాజేంద్ర, రామ్మోహన్ వర్మ, గిరిబాబు, రాజేష్, ప్రవీణ్, ఎంపీటీసీ అయ్యప్ప, వైస్ ఎంపీపీ దేరాల సుబ్రహ్మణ్యం, రమేష్, మాజీ వైస్ సర్పంచ్ చక్రపాణి, మూర్తి ఢిల్లీ బాబు, నాయకులు ఆరుముగం, ప్రభాకర్, కార్తీక్, జానీ, పర్వ తాల బాలసుబ్రమణ్యం, వేలు, శివయ్య, బాబు, నాగరాజు, రామచంద్రయ్య, నాగేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# తొండవాడ హౌసింగ్ కాలనీని సందర్శించిన కేంద్ర బృందం



**చంద్రగిరి – ఆంధ్రనాడు, మే 29 :** చంద్రగిరి మండలం తొండవాడ పంచాయతీలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ బియల్ సి హౌస బి ఎల్ సి గృహ నిర్మాణ పథకం ద్వారా నిర్మించిన యన్టీఆర్ హౌసింగ్ కాలనీని కేంద్ర బృందం శుక్రవారం పరిశీలించారు. పట్టణ జనాభా యొక్క గృహ అవసరాలను తీర్చడంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన - అర్బన్ పథకం యొక్క ప్రభావాన్ని మూల్యాంకనం చేసారు. భారత గృహ నిర్మాణ మరియు పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఐఐటి ఖరగ్‌పూర్‌లోని ఆర్కిటెక్చర్ మరియు రీజినల్ ప్లానింగ్ విభాగం నుంచి పర్యవేక్షణ చేయడానికి ప్రత్యేకంగా ఒక టీం ని ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ సుమనా గుప్త, దేబో స్మిత గోష్, భిక్రమ్ ఖాన్‌లతో కూడిన ప్రత్యేక బృందం మూడు రోజులపాటు జిల్లాలో వివిధ ప్రాంతాలలో పర్యటించనుంది. అందులో భాగంగా శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గంలోని తొండవాడ హౌసింగ్ లే అవుట్‌ను ఈ టీం సందర్శించి ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బన్ హౌసింగ్ స్కీం ఆధ్వర్యంలో జరుగుతున్న హౌసింగ్ నిర్మాణాలను పరిశీలించారు, అనంతరం లేఅవుట్లో ఉన్న లబ్ధిదారులతో సమావేశమై వివరాలను సేకరించారు అనంతరం ఈ నివేధికను భారత ప్రభుత్వ ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ హోసింగ్ మంత్రిత్వ శాఖకు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గోపాల్ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీరాములు రెడ్డి, శేషగిరి, డిఇఇలు రమణయ్య, ప్రధానమంత్రి ఆవాస యోజన హౌసింగ్ స్పెషలిస్ట్ డాక్టర్ కాటమరాజు, మహమ్మద్ అనీఫ్, సరస్వతి, ఏఇలు, వర్క్ ఇన్స్పెక్టర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు



# మైనింగ్ పేరిట మల్లయ్యకొండ జోలికొస్తే ఊరుకోం..

**- ఆ ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ఉపసంహారించుకోవాలి**
**- భక్తుల మనోభావాలు దెబ్బతిస్తే ప్రాణ త్యాగాలకూ సిద్ధంగా ఉన్నాం**



**తంబళ్లపల్లి – ఆంధ్రనాడు, మే 29:** మైనింగ్ పేరుతో తంబళ్లపల్లికి సమీపంలోని ప్రసిద్ధ మల్లయ్యకొండ, సాదుకొండ, ఇనుము కొండల జోలికొస్తే చూస్తూ ఊరుకోబోమని స్థానికులు, భక్తులు హెచ్చరించారు. శుక్రవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మల్లికార్జున స్వామి అన్నదాన కమిటీ సభ్యులు మల్లయ్య కొండ కింద అన్నదానం కేంద్రం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చోళుల కాలంలో నిర్మించిన పురాతన క్షేత్రం మల్లయ్యకొండ భక్తుల కోరిన కోర్కెలు తీరుస్తూ కొంగు బంగారంగా విరాజిల్లుతోందన్నారు. మల్లయ్య కొండ సముదాయల చుట్టు సుమారు 300 గ్రామాలున్నాయని, అందరూ వ్యవసాయం చేసి జీవిస్తున్నారన్నారు. కొండల్లో మైనింగ్ చేపడితే ఈ ప్రాంత భూములు దుమ్ము, ధూళితో నిండి మొత్తం ఎడారిగా మారుతుందని తంబళ్లపల్లి, పెద్దమండ్యం రెండు మండలాల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. మహిమాన్వితమైన సాదు, మల్లయ్యకొండల్లో భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కొలువై వున్నాడని నిత్యం రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి వందలాది మంది భక్తులు కొండకు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారన్నారు. ఇంతటి చరిత్ర కలిగివున్నటువంటి కొండలను అధ్యాత్మికంతో పాటు పర్యాటకంగా అభివృద్ధి చేయాలే కాని మైనింగ్ పేరుతో ధ్వంసం చేసి భక్తుల మనోభావాలు దెబ్బతియొద్దన్నారు. ప్రభుత్వం వెంటనే మైనింగ్ ప్రక్రియను ఉపశమహరించుకోవాలన్నారు. ప్రజాభిప్రాయం కాదని ఈ మూడు కొండల జోలికొస్తే పార్టీలకతీతంగా అందరం ఏకమై ఆమరణ నిరాహార దీక్షలు, పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రాణ త్యాగాలకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీం, ఎంపీటీసీ సభ్యులు మహేష్, కరీముల్లా, మల్లికార్జున స్వామి అన్నదానం కమిటీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ నాగ సుబ్బారెడ్డి, సభ్యులు, భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, ఆశ్రమం శ్రీకృష్ణచైతన్య స్వామి, నాయకులు చౌడేశ్వర, సుధాకర్ రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు, రామూర్తి, రెడ్డి మల్ రెడ్డి, శ్రీనివాసులు, నరసింహా రెడ్డి, బాలకృష్ణ రెడ్డి, నారాయణ రెడ్డి, రమణా రెడ్డి, కళ్యాణ్, భద్ర, సుధాకర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుడు గోవర్ధన్ రెడ్డి అరెస్టు

**- 23 గ్రాముల బంగారం, 30 గ్రాముల వెండి, ఒకద్విచక్ర వాహనం స్వాధీనం**



**సత్యవేడు – ఆంధ్రనాడు, మే 29:** సత్యవేడు మండలం కాలమ నాయుడుపేట పంచాయతీ గాంధీపురంలో చోటు చేసుకున్న చోరీతోపాటు, నాగలాపురం మండలం కారని, నాగలాపురం చోరీ కేసులకు సంబంధించి నిందితుడు, యువకుడు గోవర్ధన్ రెడ్డిని(23) స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. సత్యవేడు పోలీస్ స్టేషన్లోనూ, నాగలాపురం పోలీస్ స్టేషన్లో నమోదైన చోరీ కేసుల్లో నిందితుడు గోవర్ధన్ రెడ్డి నుంచి 23 గ్రాముల బంగారం, 30 గ్రాముల వెండి, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై సాయినాథ్ చౌదరి, లావణ్య ఆధ్వర్యంలో నిందితున్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఎస్సై సాయినాథ్ చౌదరి కథనం మేరకు వివరాలు ఇలా.. సత్యవేడు మండలం కాలమ నాయుడుపేట పంచాయతీ గాంధీపురంలో నివసిస్తున్న హిమాయవర్మ ఇంటిలో మే 17వ తేదీన పగలు సమయంలోనే చోరీచోటు చేసుకుంది. దీనిపై ఫిర్యాదు అందడంతో మే 18వ తేదీన కేసు నమోదు చేశారు. స్థానిక సిఐ మురళి నాయుడు సూచన మేరకు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా పట్టణంలోనే చెన్నై మార్గంలో మే 28వ తేదీన వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానతుడ్ని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు విషయం బయటపడింది. ఈ నేపథ్యంలోనే గాంధీ పురం చోరీకి సంబంధించి నేరం చేసినట్టు విచారణలో తేలడంతో అనుమానుతున్ని అరెస్ట్ చేశారు. మధనంబేడు గ్రామానికి చెందిన మణి కుమారుడు గోవర్ధన్ రెడ్డిగా గుర్తించామన్నారు. ఇదేగాక నాగలాపురం పట్టణంలో ఒక ద్విచక్ర వాహనాన్ని, కారని గ్రామంలో ఇంట్లో చొరబడి మూడు గ్రాముల బంగారు చోరీకి నిందితుడు గోవర్ధన్ రెడ్డి పాల్పడినట్టు విచారణలో తేలింది. ఈ క్రమంలో నిందితుడి నుంచి నాలుగు లక్షల 50 వేల రూపాయలు విలువ చేసే బంగారం, వెండితోపాటు, హీరో హోండా ఫ్యాషన్ మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నారు. గత రెండేళ్లుగా నిందితుడు గోవర్ధన్ రెడ్డి వేర్వేరు ప్రాంతాల్లో చోరీకి పాల్పడ్డారు. ఇప్పటికే తమిళనాడు పాదర్వేడులో, శ్రీసిటీ, మధనంబేడు, విఆర్ కండ్రిగ వంటి ప్రాంతాల్లో చోరీకి సంబంధించి గత ఏడాది నిందితుడు గోవర్ధన్ రెడ్డి జైలుకు వెళ్లి వచ్చారు. ఇప్పటికే గోవర్ధన్ రెడ్డిపై ఐదు చోరీ కేసులు నడుస్తుండగా తాజాగా మరో మూడు కేసులు నమోదు అయ్యాయి. జైలుకు వెళ్లడం, జైలు నుంచి బయటకు రాగానే యధావిధిగా చోరీలకు పాల్పడడం గోవర్ధన్ రెడ్డికి షరా మామూలుగా మారింది. గంజాయి వినియోగం, మద్యం సేవించడం వంటి దురఅలవాట్లకు బానిస కావడంతో ఒంటరిగానే చోరీలకు పాల్పడుతున్నట్టు ఈ సందర్భంగా ఎస్ఐ సాయినాథ్ చౌదరి చెప్పారు. ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్లి నిందితుడు గోవర్ధన్ రెడ్డి పై పీడీ యాక్ట్ అమలు చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. అయితే ఎవరైనా సరే ఇంటి ఊరుకు వెళ్ళేటప్పుడు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దీంతోపాటు ఆర్థిక స్థోమత ఉన్న వారందరూ ఇంటి లోపల బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఏదైనా అత్యవసరం అనిపిస్తే 112 కు ఫోన్ చేయాలని ఆయన పేర్కొన్నారు. నిందితుడు గోవర్ధన్ రెడ్డిని చిత్తూరు కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్కు తరలిస్తున్నట్టు ఆయన వివరించారు. వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుడు గోవర్ధన్ రెడ్డి నుంచి నాలుగు లక్షల 50 వేల రూపాయలు విలువచేసే బంగారం, వెండి సొత్తుతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్థానిక పోలీసు అధికారులు స్వాధీనం చేసుకోవడంపై జిల్లా పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

# మలేరియా, డెంగ్యూ నియంత్రణపై సమష్టి చర్యలు అవసరం

- మలేరియా వ్యతిరేక మాసోత్సవ బ్యానర్ ఆవిష్కరణ
- డిఎంహెచ్ఓ డా.వి. బాలకృష్ణ నాయక్




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 29:** మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకొని గురువారం తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి (డిఎంహెచ్ఓ) డా.వి. బాలకృష్ణ నాయక్ వారి కార్యాలయంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మలేరియా వ్యాధి నిర్మూలనకు అన్ని వర్గాల ప్రజలు, ఆరోగ్య శాఖ సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా వ్యతిరేక కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల్లో మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, ముందస్తు జాగ్రత్త చర్యలపై విస్తృత ప్రచారం చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డా.రూప్ కుమార్, డిపిఎంఓ డా.చత్ర ప్రకాష్ రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఎంపిఎచ్ఈఓలు, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నెలసరి శుభ్రత ఆరోగ్యానికి భద్రత



**వాయల్పాడు / పీలేరు – ఆంధ్రనాడు, మే 29:** నెలసరి శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. జాతీయ రతుస్రావ (మాసిక )పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చింతపర్తి పి. హెచ్. సి. పరిధిలోని చింతపర్తి గ్రామం మెయిన్ స్కూల్, చింతలవారి పల్లి గ్రామం, విటలం గ్రామాల్లో కిషోర బాలికలకు మరియు తల్లులకు రతుస్రావ పరిశుభ్రత పై అవగాహన కల్పించి నాప్కిన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుచు రుతు స్రావము అనేది సాదారణ ప్రక్రియ అనీ ప్రతీ మహిళ రుతు స్రావము జరుగు రోజులలో వ్యక్తిగత పరిశుభ్రత తప్పక పాటించాలని, ఆ ఐదు రోజులు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతీ రోజూ స్నానం చేయాలని, ప్యాడ్స్ ప్రతీ నాలుగు గంటలకు ఒకసారి బ్లీడింగ్ సమయం లో మార్చుకోవాలి. వాడిన ప్యాడ్స్ ను శాస్త్రీయంగా పారవేయడం చేయాలని ప్లాస్టిక్ కవర్ లో పెట్టి కాల్చి వేయడం లేదా భూమిలో పూడ్చి వేయడం చేయాలన్నారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడ వేయరాదనీ ఇలా చేయడం వల్ల వ్యాధులు ప్రబలు తాయన్నారు. ప్యాడ్స్ మార్చుకున్న ప్రతీ సారి చేతులను సోపు తో శుభ్రం చేసుకొవాళన్నారు. ప్యాడ్స్ వాడని వారు ఖద్దరు బట్టలు వాడవచ్చు. వాడిన తరువాత వేడి నీటి తో ఉతికి ఎండకు ఆరబెట్టుకుని మళ్ళీ వాడుకోవచ్చు అన్నారు. చేతి వేలి గోర్లు కట్ చేసుకుని ఉండాలి అన్నారు. ఐరెన్ గల మంచి పౌష్టికాహారం తినా లన్నారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సి. హెచ్. ఓ. అరుణ, పర్యవేక్షకులు బహుద్దీన్, ఐ. సి. డి. ఎస్. పర్యవేక్షకులు బాను లక్ష్మీ, ఎమ్. ఎల్. హెచ్. పి. రెడ్డెమ్మ, సీనియర్ ఏ. ఎన్. ఎమ్. నాగరత్న, అరుణ, హెల్త్ అసిస్టెంట్ వలిసాబ్, ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలకు అండగా నల్లారి కుటుంబం

- మహిళల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి: నల్లారి తనజా రెడ్డి




**పీలేరు – ఆంధ్రనాడు,మే 29 :** తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం మహిళలతో ప్రత్యేకంగా సమావేశమైన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనజా రెడ్డి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఈ సందర్భంగా మహిళలు విద్యుత్ సరఫరా, త్రాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు వంటి పలు అంశాలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన తనజా రెడ్డి, మీ సమస్యలన్నింటినీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేలా చూస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. "మీకు అండగా ఎమ్మెల్యే గారు, నేను ఎప్పుడూ ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం, పర్చువల్ విధానంలో రెండు రోజులపాటు నియోజకవర్గంలో జరిగిన మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళలు, నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మహిళా శక్తి ఎంతో అవసరమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీలేరు మండల పార్టీ అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామమూర్తి, మండల మహిళా అధ్యక్షురాలు పురం రెడ్డెమ్మ, మొహమ్మద్ పీర్ తో పాటు పలువురు మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కార్యాలయాలపై పసుపు రాజకీయాల ముసురు..!

- ఎంపీడీవో కార్యాలయం వద్ద టీడీపీ ఫ్లెక్సీల హంగామా
- అధికారుల మౌనం పై మండల ప్రజల మండిపాటు
- ఇది ప్రభుత్వ కార్యాలయమా..? లేక పార్టీ కార్యాలయమా..?



**కేవీబీపురం – ఆంధ్రనాడు, మే 29:** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం రాజకీయ రంగు పులుముకుంటోందా..? ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణం అధికార పార్టీ ప్రచార వేదికగా మారిందా..? అనే విమర్శలు మండల వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు రోజుల తరబడి అలాగే వేలాడుతుండగా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరించడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహానికి దారితీస్తోంది. ప్రభుత్వ కార్యాలయాల వద్ద రాజకీయ ప్రచార ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయరాదనే స్పష్టమైన నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయాల్సిన అధికారులే నిబంధనలను తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో సాధారణ వ్యక్తులు లేదా ఇతర సంస్థలు ఏర్పాటు చేసిన చిన్నపాటి బ్యానర్లను సైతం వెంటనే తొలగించిన అధికారులు, ఇప్పుడు టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీల విషయంలో మాత్రం అసాధారణ మౌనం పాటించడం అనుమానాలకు తావిస్తోంది. ఒకరికి ఒక న్యాయం అధికార పార్టీకి మరో న్యాయమా అంటూ మండల ప్రజలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. అధికార యంత్రాంగం పూర్తిగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని, ప్రభుత్వ కార్యాలయ గౌరవాన్ని రాజకీయాలకు తాకట్టు పెడుతున్నారని మండిపడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం ముందు రాజకీయ ఫ్లెక్సీలు రెపరెపలాడుతున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక అధికారులే అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారా..? అనే చర్చ మండలంలో జోరుగా సాగుతోంది. కొందరు ప్రజలు అయితే ప్రభుత్వ ఉద్యోగులా లేక పార్టీ కార్యకర్తలా అంటూ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే రాజకీయ ప్రదర్శనలకు వేదికలుగా మారితే ప్రజాస్వామ్య విలువలు ఎక్కడ నిలుస్తాయని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల మౌనం ప్రజల్లో మరింత అనుమానాలను పెంచుతోందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉన్న రాజకీయ ఫ్లెక్సీలను తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీసిటీలో ముగిసిన వేసవి శిబిరం



**ఆంధ్రనాడు – శ్రీసిటీ, మే 29:** శ్రీసిటీ వేసవి శిబిరం (సమ్మర్ క్యాంపు) తమకు విజ్ఞానం, వివిధ అంశాలలో నైపుణ్య శిక్షణతో పాటు వినోదం, ఆహ్లాదాన్ని పంచిందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. గత నెల 27న ఇరుగుళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వేసవి శిబిరం శుక్రవారంతో ముగిసింది. స్థానిక అకార్డ్ స్కూల్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ముగింపు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేసవి శిబిరం పట్ల విద్యార్థులు తమ అభిప్రాయాలను, మధురానుభూతులను పంచుకున్నారు. తమ ప్రాంతంలో గతంలో ఇలాంటివి అందుబాటులో లేవని, ఉచిత భోజన, వాహన వసతితో పాటు చక్కని శిబిరం ఏర్పాటు చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏప్రిల్ 27 నుంచి మే 29 జరిగిన వేసవి శిబిరంలో 8, 9, 10వ తరగతుల పరీక్షలు పూర్తయిన విద్యార్థులు 68 మంది హాజరు కాగా, 50 మంది చివరివరకు పాల్గొన్నారు. శిక్షణలో స్పోకెన్ ఇంగ్లీష్, గణిత సూత్రాలు, వేదిక్ మ్యాథ్స్, బేసిక్ కంప్యూటర్ కోర్సు, వ్రాత నైపుణ్యాలు, పోటీ పరీక్షల మెళకువలు, హస్త కళలు అంశాలను బోధించారు. యోగా, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, మరికొన్ని క్రీడలలో తర్ఫీదు ఇచ్చారు. క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య చికిత్సల పట్ల ప్రత్యక్ష అభ్యసన ద్వారా అవగాహన కల్పించారు. తిరుపతిలోని జంతు సంరక్షణ కేంద్రం, సైన్స్ సెంటర్, ఇస్కాన్ ఆలయం క్షేత్ర పర్యటనలు మరియు శ్రీసిటీలోని పెప్సీ, వైటల్ పేపర్స్ పరిశ్రమలు, నర్సరీ సందర్శనలకు తీసుకెళ్లారు. స్థానిక అపోలో హెల్త్ కేర్ సెంటర్, శంకర నేత్రాలయ , కేర్ డెంటల్ వారిచే జనరల్ హెల్త్, నేత్ర, పంటి వైద్య శిబిరాలను నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు చేశారు. శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి వివిధ కోర్సులతో ఈ కార్యక్రమాన్ని రూపొందించి మార్గనిర్దేశం చేశారు. వేసవి సెలవులను వృధా చేయకుండా గ్రామీణ విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, నైపుణ్య శిక్షణ అందించాలన్న లక్ష్యంతో వరుసగా రెండవ ఏడాది ఏర్పాటు చేసిన వేసవి శిబిరం విజయవంతం కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు. మరిన్ని వినూత్న కోర్సులతో ప్రతిఏడాది వేసవి శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం శ్రీసిటీ పరిసర ప్రాంతాల విద్యాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. పరిశ్రమల భాగస్వామ్యంతో శ్రీసిటీ ఫౌండేషన్ ద్వారా ఇప్పటికే పరిసర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావసతులు మెరుగు పరిచామన్న ఆమె, దీనిని నిరంతరంగా కొనసాగిస్తామని చెప్పారు. అధ్యాపక బృందం రంజిత (క్రాఫ్ట్), దుష్యంత్ (పోటీ పరీక్షలు), సౌమ్య మరియు సాయి లక్ష్మి (ఇంగ్లీష్), చెంచయ్య (కంప్యూటర్స్, మ్యాథ్స్), కోదండం (యోగా), మురళి (క్రీడలు) వేసవి శిబిరం శిక్షకులుగా వ్యవహరించారు. ముగింపు వేడుకలలో క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అలాగే ఆటపాటలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన రంజిత రమేష్ కుమార్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాండలెజ్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు క్యాడ్బరీ చాక్లెట్లను పంచిపెట్టారు. శ్రీసిటీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# జూన్‌లో తిరుచానూరు టిటిడి ఆలయాల్లో విశేష ఉత్సవాలు

- విడుదలైన షెడ్యూల్
- తిరుచ్చి ఉత్సవాలు, తెప్పోత్సవాలు, బ్రహ్మోత్సవాలతో భక్తులకు ఆధ్యాత్మిక వైభవం
- తిరుచానూరు, అప్పలాయగుంట ఆలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు



**తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 29:** జూన్ నెలలో టిటిడి పరిధిలోని పలు ఆలయాల్లో నిర్వహించనున్న విశేష ఆధ్యాత్మిక ఉత్సవాల షెడ్యూల్‌ను టిటిడి ప్రధాన ప్రజా సంబంధాల అధికారి విడుదల చేశారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించే విధంగా ప్రత్యేక సేవలు, వాహన సేవలు, అభిషేకాలు, ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు. తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం (జూన్ 5, 12, 19, 26 తేదీల్లో) సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. జూన్ 4న అమ్మవారి జన్మ నక్షత్రం అయిన ఉత్తరాషాడ నక్షత్రం సందర్భంగా అమ్మవారు గజ వాహనంపై మాడ వీధుల్లో విహరించనున్నారు. జూన్ 25 నుంచి 29 వరకు వార్షిక తెప్పోత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. అమ్మవారి అనుబంధ ఆలయాలు శ్రీ సూర్య నారాయణ స్వామి ఆలయంలో జూన్ 23న స్వామి వారి జన్మ నక్షత్రం అయిన హస్త నక్షత్రం సందర్భంగా తిరుచ్చి ఉత్సవం నిర్వహించనుండగా, శ్రీ సుందరరాజు స్వామి ఆలయంలో జూన్ 9న స్వామివారికి తిరుచ్చి ఊరేగింపు జరగనుంది. అలాగే శ్రీ బలరామకృష్ణ స్వామి ఆలయంలో జూన్ 14న స్వామి వారి జన్మ నక్షత్రం రోహిణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక తిరుచ్చి ఉత్సవం నిర్వహించనున్నారు. అలాగే శ్రీ శ్రీనివాస స్వామి ఆలయంలో ప్రతి శనివారం ఉదయం 8 గంటలకు అభిషేకాలు నిర్వహించనున్నారు. అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో జూన్ నెలలో అష్టదళ పాదపద్మారాధన, కల్యాణోత్సవం, అష్టోత్తర శత కలశాభిషేకం వంటి ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. జూన్ 25 నుంచి జూలై 3 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. అదేవిధంగా ప్రతి ఆదివారం ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

# జిల్లాను అక్షరాస్యతలో అగ్రస్థానంలో నిలపాలి

- అక్షర ఆంధ్ర-ఉల్లాస్ కార్యక్రమం వేగవంతం
- 86,345 నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యం
- డిఆర్ఓ నరసింహులు



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 29:** తిరుపతి జిల్లాను అక్షరాస్యతలో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా రెవిన్యూ అధికారి (డిఆర్ఓ) నరసింహులు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన అక్షర ఆంధ్ర–ఉల్లాస్ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది 86,345 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చడమే లక్ష్యమని తెలిపారు. ఇందుకు డిఆర్డిఏ, డ్వామా, మెప్మా, జివిస్డబ్ల్యూఎస్ వంటి శాఖల సహకారం అవసరమని పేర్కొన్నారు. నిరక్షరాస్యత అభివృద్ధికి పెద్ద అడ్డంకిగా మారిందని, ముఖ్యంగా ఎస్ఎస్ఛి మహిళలు, ఉపాధి హామీ పథక కార్మికులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జూన్ 30లోగా నిరక్షరాస్యులను గుర్తించి వాలంటీర్లను ఎంపిక చేసి వారి వివరాలను అక్షర ఆంధ్ర యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. జూలైలో తరగతులు ప్రారంభించి 2027 మార్చి వరకు కొనసాగించనున్నట్లు వెల్లడించారు. వయోజనులకు అక్షరాస్యతతో పాటు మొబైల్ వినియోగం, బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాలపై అవగాహన, చట్టాలు, ఆరోగ్యం మరియు ప్రజాప్రయోజనకర యాప్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తామని నోడల్ అధికారి ఎన్. ప్రసాద్ తెలిపారు. జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వాలంటీర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నారా లోకేష్‌కి ఘన స్వాగతం



**చిత్తూరు, మే 29, ఆంధ్రనాడు:–** తమిళనాడు రాష్ట్రం షోలింగర్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ యోగ నరసింహస్వామి ఆలయానికి విచ్చేసిన తెదేపా వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సాదర స్వాగతం పలికారు. సహచర ఎమ్మెల్యేలు పులివర్తి నాని , కె.మురళీ మోహన్, ఇతర తెదేపా నాయకులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం నారా లోకేష్ గారితో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం హెలిప్యాడ్ వద్ద పలు అంశాలపై మాట్లాడారు. ఆత్మీయ ఆలింగనంతో వీడ్కోలు పలికారు.

## ఎమ్మెల్యే వారి కార్యాలయంలో వినతుల స్వీకరణ



**చిత్తూరు, మే29, ఆంధ్రనాడు:** చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ వారి కార్యాలయం ప్రజాదర్బార్ లో శుక్రవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రమణ, డిప్యూటీ తాహశీల్దారు ఇబ్రహీం, తెదేపా నాయకులు సురేంద్ర కుమార్, నగర అధ్యక్షుడు నరేష్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మొత్తం 24 అర్జీలు రాగా.. పరిష్కార నిమిత్తం వీటిని సంబంధిత శాఖలకు పంపించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ శ్రీధర్, ట్రాన్స్ కో ఏడీ ప్రసాద్, ఇతర అధికారులు, తెదేపా నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పవన్ కళ్యాణ్ పై విషం కక్కితే ఊరుకోం

**- ప్రొఫెసర్ నాగేశ్వరరావుకు జనసేన వార్నింగ్**



**పీలేరు – ఆంధ్రనాడు, మే 29:** మేధావి అంటూ చెప్పుకునే ప్రొఫెసర్ నాగేశ్వరరావు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై అసత్య ఆరోపణలు చేయడాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి తీవ్రంగా ఖండించారు. శుక్రవారం పీలేరు పట్టణంలోని ఓ మీడియా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మండిపడ్డారు. “మేధావి వర్గం అంటూ కొంతమంది రాజకీయ నాయకులు తెలంగాణలో ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టేలా, ప్రజల మధ్య చిచ్చు పెట్టేలా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. ‘తెలంగాణ తత్వం’ పేరుతో విద్వేషం నింపి, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అగ్గి రాజేయాలని చూస్తున్నారు. ఇలాంటి విషపూరిత ప్రకటనలను జనసేన పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం” అని కలప రవి హెచ్చరించారు. పీలేరు మండల జనసేన అధ్యక్షులు మోహన్ కృష్ణ మాట్లాడుతూ, “నేను యుద్ధం మొదలుపెట్టి నేనే ముగిస్తాను అంటూ వ్యాఖ్యలు చేయడం, ఆంధ్ర వాళ్లకు తెలంగాణలో ఆస్తులు అంటూ మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ఇది కచ్చితంగా ప్రాంతాల మధ్య కుంపటి రాజేసే కుట్ర. ఇలాంటి వాళ్లను మేధావులు అనడం కన్నా మతిలేని మనుషులు అనడం కరెక్ట్” అంటూ నిప్పులు చెరిగారు. పవన్ కళ్యాణ్ రెండు రాష్ట్రాల ఐక్యతను కోరుకుంటుంటే, కొందరు స్వార్థ రాజకీయాల కోసం విషం చిమ్ముతున్నారని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గురు మోహన్, ప్రధాన కార్యదర్శి ధనసేకర, మార్కెట్ యార్డు డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**- రైతుల అభ్యంతరాలు, సూచనలను సమగ్రంగా పరిశీలించాలి**

**- జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ**



వాల్మీకిపురం/పీలేరు - ఆంధ్రనాడు, మే 29: వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాల యంలో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధ్యక్షతన వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామానికి సంబంధించిన ఎన్‌హెచ్‌ఏఐ–71 ప్రాజెక్టు భూ సేకరణ అంశంపై అవార్డు ఎంక్వైరీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ స్వాధీనం ప్రక్రియకు సంబంధించిన వివరాలు, భూ యజమానుల అభ్యంతరాలు, పరిహారం చెల్లింపులు తదితర అంశాలను సంబంధిత అధికారులతో కలిసి జేసీ సమీక్షించారు. భూ యజమానులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం పారదర్శకంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, వారి అభిప్రాయాలు, అభ్యంతరాలను నమోదు చేసి తగిన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. భూ స్వాధీనం ప్రక్రియలో ఎటువంటి సందేహాలు లేకుండా సంబంధిత రైతులకు పూర్తి వివరాలు తెలియజేయాలని సూచించారు. అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అదే సమయంలో రైతుల హక్కులు కాపాడబడేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ అధికారులు, భారత జాతీయ రహదారుల అథారిటీ ప్రతినిధులు మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన ఓటర్ల జాబితాపై జిల్లా యంత్రాంగం దృష్టి

- ఓటర్ల జాబితా శుద్ధీకరణకు పార్టీల సహకారం అవసరం
- 2002 జాబితాతో ప్రస్తుత జాబితా మ్యాపింగ్ ప్రక్రియ
- జూలై 21న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల
- సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రకటింపు
- ప్రజలు, పార్టీలు, మీడియా సహకారం కోరిన కలెక్టర్



**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 29:** స్వచ్ఛమైన, నిర్దిష్టమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ కోరారు. భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) మార్గదర్శకాల మేరకు చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులతో (బిఎల్ఓలు) సమన్వయం అవసరమని ఆయన తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించిన ప్రతి ఓటరును ముసాయిదా జాబితాలో చేర్చుతామని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో డీఆర్ఓ నరసింహులుతో కలిసి జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా శుద్ధీకరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటర్ల జాబితా అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అమలు చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 5 నుంచి రాష్ట్రంలో ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని చెప్పారు. జూన్ 5 నుంచి 14 వరకు బిఎల్ఓలు , ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, డిఈఓలకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయని వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాల సేకరణ జరుగుతుందని, ఇది అత్యంత కీలక దశ అని పేర్కొన్నారు. 2002 ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను మ్యాపింగ్ చేసి డ్రాఫ్ట్ జాబితాలో పేర్లు చేర్చుతామని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాలు నింపి బిఎల్ఓలు తిరిగి అందజేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీల బిఎల్ఏల ద్వారా రోజుకు గరిష్టంగా 50 ఫారాలు సమర్పించవచ్చని తెలిపారు. 2002 రికార్డులతో లింక్ కాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ ప్రక్రియ కొనసాగుతుందని, అవసరమైన 11 రకాల ధృవీకరణ పత్రాలతో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రాఫ్ట్ జాబితా జూలై 21న విడుదల అవుతుందని, తుది ఓటరు జాబితా సెప్టెంబర్ 22న ప్రకటించబడుతుందని వెల్లడించారు. అలాగే పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ (రేషనలైజేషన్) కూడా చేపడుతున్నట్లు తెలిపారు. 1200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలను విభజించడం, కుటుంబ సభ్యులను ఒకే కేంద్ర పరిధిలోకి తీసుకురావడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రజలు, రాజకీయ పార్టీలు, మీడియా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఎవరి ఓటు హక్కును అన్యాయంగా తొలగించబోమని ఆయన స్పష్టం చేశారు.

# స్వర్ణ ఆంధ్ర-2047కు కార్పొరేట్ బలం

- పి4తో పేదరిక నిర్మూలన దిశగా అడుగు
- అభివృద్ధిలో కలిసి నడుద్దాం
- జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పిలుపు
- జీరో పావర్టీకి సమిష్టి కృషి అవసరం
- సామాజిక బాధ్యతే అభివృద్ధి పునాది
- సిఎస్ఆర్ తో గ్రామీణాభివృద్ధి బలోపేతం
- శాప్ డైరెక్టర్ డా. వి. సాంబశివ రాజు




తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 29: స్వర్ణ ఆంధ్ర–2047 లక్ష్య సాధనలో కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో స్వర్ణ ఆంధ్ర ఎ4 ఫౌండేషన్ (శాప్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన “స్వర్ణ ఆంధ్ర ఏ2047” లో భాగంగా అమలవుతున్న “జీరో పావర్టీ –పి4” కార్యక్రమానికి వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఏర్పాటు చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గుర్తించిన బంగారు కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యం అవసరమని ఆయన స్పష్టం చేశారు. పేదరిక నిర్మూలనతో పాటు స్థిరమైన సామాజిక–ఆర్థిక అభివృద్ధి సాధనలో అన్ని రంగాల సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలు తమ సిఎస్ఆర్ కార్యక్రమాలను జిల్లా అభివృద్ధి ప్రాధాన్యాలతో అనుసంధానం చేసి ఆరోగ్యం, విద్య, జీవనోపాధి, మహిళా సాధికారత, శిశు సంక్షేమం, పర్యావరణం గ్రామీణాభివృద్ధి రంగాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన సూచించారు. శాప్ డైరెక్టర్ డా. సాంబశివ రాజు మాట్లాడుతూ, పి4 కార్యక్రమం కేవలం సంక్షేమ పథకం మాత్రమే కాకుండా, సమిష్టి భాగస్వామ్యం, సామాజిక బాధ్యత ఆధారంగా స్వయం సమృద్ధి కలిగిన కుటుంబాలను నిర్మించే ప్రజా ఉద్యమమని వివరించారు. సమావేశంలో పి4 నమూనా లక్ష్యాలు, అమలు విధానం, కార్యాచరణపై అధికారులు సమగ్ర వివరాలు అందించారు. వివిధ కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు, పిఎస్యూలు, చారిటబుల్ ఫౌండేషన్లు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని పి4 కార్యక్రమం అమలులో భాగస్వామ్యం అవుతామని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర పిఎంయూ సభ్యులు హారికానాథ్, ఎం. శ్రీనివాస్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పి. రాజశేఖర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈ మదన్ మోహన్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు, బాలికల భద్రతకు రాష్ట్ర పోలీసుల ప్రత్యేక కార్యాచరణ

- ‘ఆపరేషన్ దండాయన’ ప్రారంభం: జిల్లా ఎస్పీ తుషార్ డూడి
- మహిళలు మరియు బాలికలపై నేరాలకు జీరో టాలరెన్స్...
- నిందితులపై కఠిన చర్యలు, నిరంతర నిఘా



చిత్తూరు, మే 29, ఆంధ్రనాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలు, బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, వారిపై జరిగే నేరాలకు పాల్పడే వారికి త్వరితగతిన శిక్షలు పడేలా చిత్తూరు జిల్లా వ్యాప్తంగా “ఆపరేషన్ దండాయన” కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర గౌరవ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, మహిళా ఄ శిశు భద్రత విభాగం ఐజీపీ బి.రాజకుమారి పర్యవేక్షణలో రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘స్పీడ్ ట్రయల్ మానిటరింగ్’ విధానాన్ని జిల్లాలో క్షేత్రస్థాయిలో వేగవంతం చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో మహిళలపై జరిగే అత్యాచారాలు, గృహ హింస, పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్లో నేరస్థులపై కఠిన నిఘా ఉంచేందుకు, నేరాల నియంత్రణకు ‘శక్తి’ కార్యక్రమాల్లో భాగంగా ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో మహిళా భద్రతకు సంబంధించిన గణాంకాలను వెల్లడిస్తూ, జిల్లా ఏర్పడినప్పటి నుండి ఇప్పటి వరకూ, మహిళలపై నేరాలలో (క్రైమ్ అగైనిస్ట్ ఉమెన్) 16 కేసుల్లో నిందితులకు కోర్టు ద్వారా కన్విక్షన్ (శిక్షలు) పడేలా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. మహిళలపై జరిగే నేరాల విషయంలో జిల్లా పోలీస్ యంత్రాంగం ‘జీరో టాలరెన్స్ విధానం’ అవలంబిస్తోందని, నిందితులు ఎంతటి ప్రభావశీలురైనా సరే చట్టం ముందు లొంగాల్సిందేనని ఎస్పీ స్పష్టం చేశారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ఈ ఆపరేషన్ నిరంతరం కొనసాగుతుందని, మహిళల రక్షణ కోసం ప్రజలంతా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టం ద్వారా విచారణలో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నేరస్థులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామని, సంచలనాత్మక కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. జిల్లాలో పదే పదే నేరాలకు పాల్పడే పునరావృత నేరస్థులు, అనుమానితులపై నిఘా కోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ‘సెక్సువల్ అఫెండర్ షీట్లు’ తెరిచామని, జియో ట్యాగింగ్, ‘నైబర్ హుడ్ వాచ్’ పద్ధతుల ద్వారా వారి కదలికలను నిరంతరం గమనిస్తున్నట్లు వెల్లడించారు. బాధితులకు తగిన రక్షణ కల్పిస్తూ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో కౌన్సెలింగ్, ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని ఎస్పీ వివరించారు. కేవలం శిక్షించడమే కాకుండా, నేరస్థుల్లో మార్పు తీసుకువచ్చేందుకు సామాజిక కార్యకర్తల భాగస్వామ్యంతో జిల్లావ్యాప్తంగా “పరివర్తన సదస్సులు” నిర్వహిస్తున్నామని, ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. చట్టాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో అవగాహన పెంచడంతో పాటు నేరస్థుల్లో భయం కలిగించేలా.. ఇటీవల మహిళలపై జరిగిన నేరాల్లో కోర్టులు విధించిన కఠినమైన తీర్పుల వివరాలను జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ తుషార్ డూడి ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డా. తరుణ్ పహ్వా, ఎస్.బి ఇన్స్పెక్టర్ మురళీమోహన్, ఇన్స్పెక్టర్ మనోహర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## బంగారు తిరుచ్చిపై పద్మావతీ అభయం

తిరుచానూరు – ఆంధ్రనాడు, మే 29: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి పై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. శుక్రవారంలో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మేలుకొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవర్లను వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకెళ్లి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించిన వైభవంగా ఉంజల సేవ నిర్వహించారు. అనంతరం బంగారు తిరుచ్చిపై కొలువు దీర్చి తిరుమాడా వీధుల్లో ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కర్పూర నీరాజనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరేంద్రనాథ్, ఆలయ ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్లు రమేష్, సురేష్, మునిచంగల్రాయులు ఇన్స్పెక్టర్లు ప్రసాద్, చలపతి ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# గిల్ సూపర్ సెంచరీ... ఐపీఎల్ ఫైనల్లోకి దూసుకెళ్లిన గుజరాత్... రాజస్థాన్ కల చెదిరింది!

- ఐపీఎల్ 2026 ఫైనల్ చేరిన గుజరాత్ టైటాన్స్
- క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు
- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత సెంచరీ.. సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ
- రాజస్థాన్ బ్యాటర్ సూర్యవంశీ 96 పరుగుల పోరాటం వృథా
- మే 31న ఆర్సీబీతో గుజరాత్ టైటిల్ ఫైట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్–2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104) బాధ్యతాయుతంగా ఆడి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించాడు. రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.




భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను రాజస్థాన్ నుంచి లాగేసుకున్నారు. ముఖ్యంగా గిల్, రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు.

వీరిద్దరూ అవుటైన తర్వాత రాహుల్ తెవాటియా (17 నాటౌట్) తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (45 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. చివర్లో డొనోవన్ ఫెరీరా (11 బంతుల్లో 38) విధ్వంసం సృష్టించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు.

ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధించగా, రాజస్థాన్ రాయల్స్ ప్రస్థానం టోర్నీలో ముగిసింది. మే 31న (ఆదివారం) జరిగే టైటిల్ పోరులో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది.

## ఆమె దేశానికి గర్వకారణం..

వినేశ్ ఫోగట్‌కు సుప్రీంకోర్టులో ఊరట
- 2026 ఏషియన్ గేమ్స్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు వినేశ్ ఫోగట్‌కు అనుమతి



ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాల్ చేసిన రెజ్లింగ్ ఫెడరేషన్ పిటిషన్‌పై విచారణ వినేశ్ దేశానికి గర్వకారణమని వ్యాఖ్యానించిన సుప్రీంకోర్టు ధర్మాసనం క్రీడా వ్యవహారాల్లో హైకోర్టుల మితిమీరిన జోక్యంపై అసహనం వ్యక్తం చేసిన కోర్టు ఈ కేసులో పూర్తి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసిన సుప్రీంకోర్టు భారత స్టార్ రెజ్లర్, మూడుసార్లు ఒలింపియన్‌గా దేశానికి ప్రాతినిధ్యం వహించిన వినేశ్ ఫోగట్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2026 ఏషియన్ గేమ్స్ కోసం ఈ నెల 30, 31 తేదీల్లో జరగనున్న సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు సర్వోన్నత న్యాయస్థానం ఆమెకు అనుమతి ఇచ్చింది. ఈ విషయంలో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.


వినేశ్ ఫోగట్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అవకాశం ఇవ్వాలని గత వారం ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. మాతృత్వం అనేది ఒకరి వృత్తిపరమైన అవకాశాలను అడ్డుకునే వైకల్యం కాదని హైకోర్టు స్పష్టం చేసింది. అయితే, సమాఖ్య నిబంధనల ప్రకారం వినేశ్‌కు అర్హత లేదని వాదిస్తూ డబ్ల్యూఎఫ్ఐ, ఢిల్లీ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పీ) దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "ఆమె స్థానంలో వేరే ఎవరైనా ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది. కానీ, వినేశ్ దేశానికి గర్వకారణంగా నిలిచిన క్రీడాకారిణి" అని ధర్మాసనం అభిప్రాయపడింది. "హైకోర్టు తీర్పుతో ఆమెలో ఆశలు, అంచనాలు పెరిగాయి. ఈ దశలో మేం ఏమీ చేయలేమని చెప్పి ఆమెను వెనక్కి పంపడం సరికాదు" అని డబ్ల్యూఎఫ్ఐ తరపు న్యాయవాదికి స్పష్టం చేసింది. అయితే, వినేశ్‌కు తాత్కాలికంగా అనుమతి ఇస్తూనే, క్రీడా వ్యవహారాల్లో హైకోర్టులు తరచుగా, అత్యంత వేగంగా జోక్యం చేసుకోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "ఇవి మెడికల్ కాలేజీ అడ్మిషన్లు కాదు. జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు సంబంధించినవి. ఈ పద్ధతిలో కోర్టులు జోక్యం చేసుకొని, మొత్తం షెడ్యూల్‌ను దెబ్బతీయలేవు" అని జస్టిస్ నరసింహ వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి వినేశ్‌కు ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతించిన సుప్రీంకోర్టు, డబ్ల్యూఎఫ్ఐ దాఖలు చేసిన పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

# జూన్ 4న 'పెద్ది' రాక... రామ్ చరణ్ బాక్సాఫీస్ లెక్కలపై ఆసక్తికర చర్చ

**పెద్ది' విడుదలకు సిద్ధం**
**'గేమ్ ఛేంజర్' నిరాశ తర్వాత వస్తున్న భారీ బడ్జెట్ చిత్రం**
**ఉత్తర అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా 533,000 డాలర్ల వసూళ్లు**
**తెలుగు పరిశ్రమలో రెవెన్యూ షేరింగ్ వివాదాలకు చిరంజీవి చొరవతో తెర**
**జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న సినిమా**




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కెరీర్‌లో ఎన్నో హిట్లు, కొన్ని ఫ్లాపులు ఉన్నాయి. 'ఆర్ఆర్ఆర్' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత ప్రపంచవ్యాప్త గుర్తింపు సాధించినప్పటికీ, ఆ తర్వాత వచ్చిన సోలో చిత్రం 'గేమ్ ఛేంజర్' బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో, ఇప్పుడు అందరి దృష్టి ఆయన తదుపరి చిత్రం 'పెద్ది'పైనే ఉంది. భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమా, చరణ్ గత చిత్రాల బాక్సాఫీస్ ఫలితాల నేపథ్యంలో ఆసక్తికరమైన చర్చకు దారితీస్తోంది.



'ఆర్ఆర్ఆర్'తో సుమారు రూ.1350 కోట్ల గ్రాస్ వసూలు చేసి కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్న చరణ్, 'గేమ్ ఛేంజర్'తో మాత్రం నిరాశపరిచారు. దాదాపు రూ.350–500 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఆ చిత్రం ప్రపంచవ్యాప్తంగా కేవలం రూ.203 కోట్లు మాత్రమే రాబట్టింది. అంతకుముందు 'ఆచార్య' (రూ.78 కోట్లు), 'వినయ విధేయ రామ' (రూ.94 కోట్లు) వంటి చిత్రాలు కూడా వాణిజ్యపరంగా విఫలమయ్యాయి.

అయితే 'రంగస్థలం' (రూ.216 కోట్లు), 'ధృవ' (రూ.95 కోట్లు) వంటి బ్లాక్‌బస్టర్లు ఆయన ఖాతాలో ఉన్నాయి. ఈ మిశ్రమ ఫలితాల మధ్య 'పెద్ది' రాక చరణ్ కెరీర్‌కు ఎంతో కీలకంగా మారింది.

బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' ఒక గ్రామీణ క్రీడా నేపథ్యం ఉన్న యాక్షన్ డ్రామా. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుమారు రూ.350 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమా, జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి.

ఉత్తర అమెరికాలో దాదాపు 19,000 టిక్కెట్లు అమ్ముడై, అడ్వాన్స్ సేల్స్ ద్వారా 533,000 డాలర్లకు పైగా వసూళ్లు సాధించింది. ఇది 'గేమ్ ఛేంజర్' ప్రీమియర్ల కోసం సాధించిన మొత్తం ప్రీ–సేల్స్‌లో 77 శాతం కావడం విశేషం.

ఇటీవల తెలుగు చిత్ర పరిశ్రమలో నిర్మాతలు, ఎగ్జిబిటర్ల మధ్య తలెత్తిన రెవెన్యూ షేరింగ్ వివాదాలను పరిష్కరించడంలో మెగాస్టార్ చిరంజీవి కీలక పాత్ర పోషించారు. ఆయన చొరవతో కొత్త పర్సంటేజ్ ఆధారిత మోడల్‌కు అందరూ అంగీకరించడంతో 'పెద్ది'కి లైన్ క్లియర్ అయింది.

ఈ చిత్రానికి ఏ.ఆర్. రెహమాన్ సంగీతం అందించడం, క్రీడాకారుడి పాత్ర కోసం రామ్ చరణ్ మేకోవర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. 'గేమ్ ఛేంజర్' నిరాశ తర్వాత వస్తున్న ఈ చిత్రంతో రామ్ చరణ్ భారీ విజయాన్ని అందుకొని తన బాక్సాఫీస్ సత్తాను మరోసారి నిరూపించుకుంటారని అభిమానులు, ట్రేడ్ వర్గాలు ఆశిస్తున్నాయి.


## నాగచైతన్య అనుమతి లేకుండా ఆయన ఫొటోలు, వీడియోలు వాడొద్దు : ఢిల్లీ హైకోర్టు



తన అనుమతి లేకుండా తన పేరు, ఫొటోలు వాడుకుంటున్నారంటూ నాగచైతన్య పిటిషన్‌తన హక్కులను కాపాడాలని కోరిన చైతూచైతూ విన్నపంపై సానుకూలంగా స్పందించిన కోర్టు తన వ్యక్తిగత గోప్యతను, హక్కులను కాపాడాలని కోరుతూ టాలీవుడ్ హీరో నాగచైతన్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. తన అనుమతి లేకుండానే తన పేరును, ఫొటోలను దుర్వినియోగం చేస్తున్నారని పిటిషన్ లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది.

నాగచైతన్య అభ్యర్థనపై ఢిల్లీ హైకోర్టు సానుకూలంగా స్పందించింది. నాగచైతన్య అనుమతి లేకుండా ఆయన పేరు, ముఖ రూపం, స్వరాన్ని వాణిజ్యపరంగా వాడకూడదని తీర్పును వెలువరించింది. నాగచైతన్య వ్యక్తిగత హక్కులను పరిరక్షిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పలువురు సినీ స్టార్లు ఢిల్లీ హైకోర్టు నుంచి ఇదే రకమైన రక్షణ పొందిన సంగతి తెలిసిందే.

## నేడు 'శ్రీనివాస్', 'మంగ' పరిచయం




జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ చిత్రంలో రషా థడానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా ఒక అప్‌డేట్ బయటకు వచ్చింది. కృష్ణ జయంతి సందర్భంగా ఈ మూవీలో ప్రధాన పాత్రలు పోషిస్తున్న శ్రీను, మంగా పాత్రలను పరిచయం చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ పరిచయ కార్యక్రమాన్ని ఈ రోజు (మే 30) సాయంత్రం 6 గంటల నుంచి హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో నిర్వహించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ చిత్రాన్ని చందమామ కథలు పిక్చర్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిర్మిస్తుండగా, ప్రముఖ నిర్మాత సి. అశ్వినీ దత్ సమర్పిస్తున్నారు. అలాగే ఈ సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

# సీఆర్సీ కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



చిత్తూరు –ఆంధ్రనాడు, మే 29: చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో 49వ వార్డు కోడిగుంటపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించిన సీఆర్సీ భవనాన్ని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం భవనంలో పూజలు నిర్వహించి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిని కాంక్షించే పార్టీ తెలుగుదేశం పార్టీ అని.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. తాజాగా ఉద్యానవన శాఖ ద్వారా వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లాకు రూ.300 కోట్లు నిధులు కేటాయించిందని.. ఈ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు ముందుకు సాగుతుందన్నారు. కోడిగుట్టపల్లి పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టడానికి చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి వార్డులోనూ మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల కోసం రూ.30-40 లక్షల వెచ్చించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే చిత్తూరులో అభివృద్ధి పనులు ఏ స్థాయిలో జరిగిందో అందరూ చూస్తున్నారని... గత కొన్ని దశాబ్దాలుగా జరిగని అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానికులు పూలమాల, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో చుడా చైర్ పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, మాజీ మేయర్ అముద, నగర తెదేపా అధ్యక్షుడు



నరేష్, ప్రధాన కార్యదర్శి పచ్చయప్ప, స్థానిక క్లస్టర్, డివిజన్, బూత్ ఇన్చార్జులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.


## స్విమ్స్- పి.జి వైద్య విద్యార్థులకు ఓరియేంటేషన్ ప్రోగ్రామ్



తిరుపతి –ఆంధ్రనాడు, మే 29: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) హాస్పిటల్ నందు పి.జి. వైద్య విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ను శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు శుక్రవారం నిర్వహించి నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా రామ్ తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ , డీన్ డా. అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్లా, మెడిసిన్ విభాగాధిపతి అల్లాడి మోహన్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఇన్ చార్జ్ ప్రిన్సిపల్ డా. నాగరాజ్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. ముత్తీశ్వరయ్య కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. చంద్రశేఖర్, డిప్యూటీ రిజిస్ట్రార్ డా. యర్రమ రెడ్డి సంయుక్తంగా జ్యోతిని వెలింగించి ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్విమ్స్ సంచాలకులు ఉపకులవతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ముందుగా వైద్య విద్యార్థులందరకీ శుభాసీస్సులు అందించారు. మీరు ఎం.బి.బి.యస్. యు.జి వివిధ కళాశాలలో విద్యనభ్యసించి, ఈ రోజు భగవంతుని స్వరూపమైన తిరుమల తిరుపతి దేవస్థానము వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న స్విమ్స్ హాస్పిటల్ నుండి వైద్య వృత్తిలోకి ప్రవేశించిన తరువాత సేవభావంతో వైద్య సేవలు అందించాలని కోరారు. చికిత్స చేసి ప్రాణంకాపాడే దేవుడుగా డాక్టర్లను నమ్ముతారని ఆ నమ్మకాన్ని ప్రతి వైద్యుడు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ప్రాణాలను కాపాడాటానికి ఎల్లప్పుడు రెడీగా వుండే వారే వైద్యులని తెలిపారు. వైద్యాన్ని ధనార్జనే ధ్యేయంగా కాకుండా సమాజ సేవకు, పేదల కోసం వినియోగించాలని కోరారు.స్విమ్స్ డీన్ డా. అలోక్ నచన్ మాట్లాడుతూ వైద్య విద్యలోకి అడుగు పెడుతున్న వైద్యులకు కార్పొరేట్, అత్యుత్తమ వైద్య ప్రమాణాలు, రోగులతో వ్యవహరించాల్సిన తీరు, నైతిక విలువలు అవగాహన కలిగివ ఉండాలని పేర్కొన్నారు. వైద్య విద్య నందు మంచి భవిష్యత్తు వుంటుందని, ప్రతి ఒక్కవైద్యులు మారు మూల గ్రామీణ ప్రాంతాలలో కూడా వైద్య సేవలు అందించాలని కోరారు.శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా. నాగరాజ్ మాట్లాడుతూ స్విమ్స్ నందు మంచి అధ్యాపకులు, లైబ్రరీ, రీసెర్చ్, ఆహ్లాదకరమైన వాతావారణం వుందని, ప్రతి ఒక్క పి.జి. వైద్యులు అధ్యాపకులతో గౌరవభావంతో మెలగాలని సూచించారు. ఈ ఓరియేంటేషన్ కార్యక్రమంలో కళాశాలలో అందుబాటులో వున్న అత్యాధునిక ల్యాబ్ సదుపాయలు అత్యవసర విభాగాల పనితీరు మరియు హాస్పిటల్ గురించి వివరించారు. మెడిసిన్ విభాగాధిపతి డా. అల్లాడి మోహన్ మాట్లాడుతూ పి.జి. కోర్సు సమయంలో ఒత్తిడిని జయించడం, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడం తదితర అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు.67 మంది పి.జి. వైద్య విద్యార్థులకు రెసిడెన్స్ మ్యాన్యువల్ ను అందజేసి, అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ కార్యక్రమంలో స్విమ్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, పి.జి.వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో ఐపిఏఎస్ఈ మే 29 థియరీ పరీక్షకు 86.5% హాజరు

తిరుపతివిద్య వైద్య –ఆంధ్రనాడు, మే 29: బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మే 29, 2026 సాయంత్రం నిర్వహించిన ఐపిఏఎస్ఈ థియరీ పరీక్షకు తిరుపతి జిల్లాలో మంచి హాజరు నమోదైంది. ప్రాంతీయ తనిఖీ అధికారి కార్యాలయం విడుదల చేసిన హాజరు నివేదిక ప్రకారం, జనరల్ కోర్సులో 52 కేంద్రాలకు 806 మంది విద్యార్థులు కేటాయించగా, 733 మంది హాజరయ్యారు. వొకేషనల్ కోర్సులో 12 కేంద్రాలకు 156 మంది కేటాయించగా, 99 మంది పరీక్ష రాశారు. మొత్తంగా జిల్లాలో 962 మందికి పరీక్ష కేటాయించగా, 832 మంది హాజరయ్యారు. హాజరు శాతం 86.5గా ఉంది. గైర్హాజరైన విద్యార్థుల సంఖ్య 130గా నివేదించబడింది.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733